


# ( 1967 లో ఆంధ్రప్రభలో సీరియల్ గా వచ్చిన నవల పునర్ముద్రణ)

(గత సంచిక తరువాయి)

**పెళ్లిసందడి తగ్గింది**. తీరికగా సాయంకాలం సుబ్రహ్మణ్యంతో షికారు బయలుదేరాడు నరసింహం. రాఘవయ్య ఎక్కడికీ రానన్నాడు. పొలాలగట్లుదాటి, తోటలుదాటి చాలాదూరం పోయారు. మాటలలో పడి రాత్రి అయిందన్న సంగతికూడా మరిచిపోయారు. నరసింహం మాటలలో ఒక ప్రత్యేకత ఉంది. నిండుదనం ఉంది. ఆకర్షకత ఉంది. సమగ్రమైన విషయజ్ఞానం ఉంది. తనకు అభిమాన విషయమైన సంస్కృత సాహిత్యాన్ని గురించి చక్కగా మాట్లాడే నేర్పుంది. సుబ్రహ్మణ్యానికి అతనిలో ఒక విశిష్టత గోచరించింది. పల్లెటూరి నరసింహంలో ఉత్తమ సంస్కారం, విపులమైన సాహిత్యజ్ఞానం, కూలంకషమైన పాండిత్యం గుర్తించి సుబ్రహ్మణ్యం ఆశ్చర్యపోయాడు. అతనిపై ప్రత్యేకమయిన గౌరవం కుదిరింది. పల్లెటూరి పెంటకుప్పలలో అమూల్యమైన రత్నం కప్పబడిపోయిందని అనుకున్నాడు. గాని నరసింహం సామాన్యమైనవాడు. పొట్టకోసం శ్రమపడుతున్నాడు. అతన్ని అర్థంచేసుకోడం కష్టమనిపిస్తూంది ఒకొక్కసారి.

మరునాడు సుబ్రహ్మణ్యం, శారద వెళ్లిపోయారు. పాలకొండవరకు వారితో కలిసి వెళ్లాడు నరసింహం. మామిడితోటల ఎండాకాలపు నీడల్లో బండిపోతూంటే, ఎద్దుల మువ్వల సందడిలో, ఆలోచనలలో మునిగితేలుతున్న శారద ముఖాన్నిచూస్తూ పెళ్లిలో పడిన శ్రమ మరిచిపోయాడు. పాలకొండలో వాళ్లను బస్సు ఎక్కించాడు. బస్సు కదులుతూంటే వారి చూపులు మళ్లీ కలిశాయి. శారద చూపులలో ఏవో చెప్పలేని లోతులు!

## 26

పెళ్లి తరవాత నరసింహం మద్రాసు చేరుకున్నాడు. పట్నం చేరిన మధ్యాహ్నమే మాధవరావుగారి ఇంటికి వెళ్లాడు. రాధ పెళ్లి సంగతులు అడిగింది. వాళ్ల మామగారు సమయానికి సహాయం చేసి ఇల్లు నిలబెట్టారని నరసింహం ఆమెతో చెప్పాడు. తల్లి ఇచ్చిన అరిసెలు, లడ్డూలు, చక్కిలాలు, పెళ్లికి చేసినవి వాళ్లకిచ్చాడు. మాధవరావు స్వంతంగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. వాళ్లకు హాయిగా కాలం గడుస్తున్నది.

ఇంటికి తిరిగి వస్తూంటే ఎగ్మూరులో భైరవశాస్త్రి కనుపించాడు. నరసింహం అతనిని చూచీ చూడనట్లు నటించినా, అతను మాత్రం నమస్కారం చేసి, ఎన్నాళ్లకో చూశానని కౌగిలించుకొని తనతో నరసింహాన్ని తిరిగి మైలాపూరు తీసుకుపోయాడు. అక్కడ సాహితీ కుటీరంలో కావ్యపఠనం ఉంది. పరిమితమైన సభ్యులలో నరసింహం ఒకడని భైరవశాస్త్రి అన్నాడు.

సాహిత్య కుటీరంలో నవ్యత తొణికిస లాడుతున్నది. మేడమీది విశాలమైన గదిలో సభ్యులు అప్పటికే చేరారు. గోడలకు మేలురకం తైలవర్ణచిత్రాలున్నాయి. చిన్నవేదిక గోడ నానుకొని ఉంది. దాని చుట్టూ రత్న కంబళాలున్నాయి. అక్కడక్కడ ముఖమల్ బాలీసులున్నవి. అగరు ధూపం గదినంతను సువాసితం చేస్తున్నది.

లోపల చేరిన సభ్యులలో ఆడ, మగ ఉన్నారు. ఆడవారి జడలలో పూలదండలు, కాటుక కళ్లనుండి వెలువడే మన్మథుని బాణాలవంటి చూపులు, పెదవులపై మందహాసాలు, ఒళ్లు పులకింపజేస్తున్నాయి.

ఆనాటి సభకు శాస్త్రిగారు సభాపతి. ఆనందం మోహన్ ప్రార్థన చదివాడు. "నవ్యాంధ్ర కవితా రీతులు" అన్న విషయంపై నారాయణగారి ఉపన్యాసం. ఆయన తెలుగు కవిత్వం పుట్టుపూర్వోత్తరాలనుదహరించి, రత్నాల వంటి తెనుగుపద్యాలు చదివారు.

తరవాత భైరవశాస్త్రి "సౌదామిని" అనే స్వీయరచిత ఖండకావ్యంనుండి గేయాలు పఠించారు. ఆ గేయాలు చాలా మధురంగా ఉన్నాయి. ఒకనాడు మాధవరావన్న మాటలు నరసింహానికి జ్ఞాపకమొచ్చాయి. ఆ పద్యాలలో మిగిలేది మాధుర్యమేనా?

తరవాత చౌదరిగారు ఆధునికమైన ఆంగ్లపద్యరీతుల ననుసరించి వ్రాసిన వచన పద్యాలు చదివారు.

ఆఖరున నృత్య ప్రదర్శన జరిగింది. గదిలో దీపాలు కొన్ని ఆర్పి, కొన్ని రంగుదీపాలు వేదికపై ప్రసరించారు. రంగు రంగుల దీపాలకాంతులలో ప్రియంవద కట్టిన బట్టలు వివిధ రూపాలను పొందాయి. ఆమె వరూధిని వేషం వేసుకుంది. అలంకరణ, భావప్రకటన ఉత్తమ స్థాయిలో ఉన్నవి. మంజుభాషిణి రాగయుక్తంగా మనుచరిత్రలోని పద్యాలు చదివింది. పద్యాలకు, పద్యాలకు మధ్య గేయాలున్నాయి. భావానుగుణంగా ఆమె నృత్యం జరిపింది.

నరసింహం ఇటువంటి ప్రదర్శన చూడడం ఇదే మొదటిసారి. అంత అందమైన నర్తకిని, అంతకుముందు చూడలేదు. అంత మధురమైన సంగీతాన్ని వినికూడా ఉండలేదేమో? విన్నది శాస్త్రీయ సంగీతంకాదు. గాని శ్రావ్యమైన లలిత సంగీతమది. నృత్యం కూడా సాంప్రదాయికమైన భరతనాట్యంకాదు. గాని మనసును పట్టిలాగే ప్రదర్శన అది. అందులో కొత్తదనం ఉంది. ఆకర్షణ ఉంది. పాత పద్ధతులను బాగా అవగాహన చేసుకొని నవ్యతకు దారితీసినదీనృత్యం.

ఆఖరున శాస్త్రిగారి ప్రసంగంతో సభ ముగిసింది. చాలామంది ప్రియంవదాదేవి నృత్యాన్ని కొనియాడారు. ఆమె నమ్రంగా పొగడ్తలను అందుకొంది. సభ్యులకు గంధం అలది, కర్పూర మిశ్రితమైన తీయని పానీయం ఇచ్చి, తాంబూలం ఇచ్చింది. ఆమె వారితో చనువుగా నవ్వుతూ మాట్లాడింది. నరసింహానికి ఇదంతా బోధపడలేదు.

సభ్యులు ఒకరి తరవాత ఒకరు వెళ్లిపోయారు. నరసింహం వెళ్లిపోతానని చెబితే, భైరవశాస్త్రి వారించి, "మీరు ఆంతరంగికులు. కొంచెంసేపు మనం మాట్లాడుకుందాం. తరవాత వెళ్లుదురుగాని" అని అన్నాడు.

నరసింహానికి ఏమి చేయాలో తోచలేదు. గదిలో తను, భైరవశాస్త్రి మిగిలారు. ప్రియంవద సభ్యులతో క్రిందికి దిగింది. భైరవశాస్త్రి తన కవిత్వం గురించి ప్రశ్నలు వేస్తున్నాడు. నరసింహం జవాబులు చెబుతున్నాడు.

ఆమె పాదాల మంజీరధ్వని మధురంగా చెవినిపడ్డది. నామమాత్రానికి వేసుకున్న పయ్యెద గాలిపాటుకి తొలిగిపోయింది. కంచుకంలో బంధింపబడిన యౌవనం ఆమె విలాసగమనంలో వికసించింది. ఆమె కట్టిన పావడ జిలుగు అంచులు మలయమారుతానికి కదలాడే చిరుతరగలలా జీరాడినవి.

ఆమె వారిని సమీపించింది. నరసింహం ముఖంలోకి సూటిగాచూచి, పయ్యెదగా వేసుకున్న వాణీ అతనిమెడలో వేసి కొంచెం తనవేపు లాగుకొని, "ఈ ప్రవరాఖ్యు డెవరు?" అని అతిసరసంగా ప్రశ్న వేసింది.

నరసింహానికి నిజంగా మతిపోయింది. మనిషి తడబడిపోయాడు. ఆమె నవ్వుతూ అతనిని కొంచెం ముందుకు లాగుకొని పెదవులమీద ముద్దు పెట్టుకుంది.

భైరవశాస్త్రి నరసింహం పడే అవస్థ గమనించి విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు.

"నువ్వు గజ్జెకట్టిన వరూధినివి. అతను నిజంగా ప్రవరాఖ్యుడే" అన్నాడు.

"ఈయన ఇక్కడ ఉన్నారంటే, నాతోపాటు వేదికమీద నిలబెట్టి, ఇంకా చక్కగా అభినయించి ఉందునేమో శాస్త్రీ. నిజంగా ఇటువంటి ఛాందసుడు ప్రవరాఖ్యుడు కాక మరెవరవుతాడు. ఇంతకీ ఇంతటి నయనసుందరు డెవరీయన?" అని ప్రియంవద ప్రశ్నించింది.

"ఈయన నరసింహం. మన ఆంతరంగిక స్నేహితులు. సంస్కృత సాహిత్యంలో మంచి కృషి చేశారు" అన్నాడు భైరవశాస్త్రి.

"నరసింహంగారూ, చాలాకాలంబట్టి నాకొక కోరిక ఉండిపోయింది, గీతాగోవిందకావ్యం చెప్పించుకోవాలని. అష్టపదులను అర్థం చేసుకొని, అభినయం చేస్తే చాలా రక్తి కడుతుంది" అంది ప్రియంవద.

నరసింహం మాట్లాడలేదు. కొంచెం ముఖం వంచుకున్నాడు.

"పాపం చాలా ఇబ్బంది పడ్డారు నరసింహంగారూ, రండి! కూచోండి. సావకాశంగా మాట్లాడండి. మిమ్మల్ని చూచిన తరవాత వరూధినిపాత్రలో తాదాత్మ్యం పొందిన నేను చుంబించకుండా ఉండలేకపోయాను. మరోవిధంగా అనుకోకండి" అంది ప్రియంవద.

"ఆనాటి వరూధినికి సాధ్యం కానిపని, నేటి వరూధిని సాధించింది" అన్నాడు భైరవశాస్త్రి.

నరసింహం జవాబు చెప్పలేదు. ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు. తరవాత వారు ముగ్గురు కూర్చున్నారు రత్నకంబళంమీద. ప్లాస్కులో కాఫీ రెండు బిస్కెట్లు ఆరగించారు. ఏవో కబుర్లు. ఆమెతో మాట్లాడ్డం మొదలుపెట్టిన కొద్ది సేపటిలో నరసింహం దారిలో పడ్డాడు.

ప్రియంవద తన కోరిక తిరిగి వెలిబుచ్చింది. గీతగోవిందంలోని అష్టపదిలో ఒక్క చరణమేనా చాలునన్నది.

నరసింహం మెల్లిగా చదివాడు.

**"సంచలదధర సుధామధురధ్వని**
**ముఖరిత మోహనవంశం,**
**చలిత దృగంచల చంచల మౌళి**
**కపోలవిలోలవతంసం,**
**రాసే హరిమిహ విహిత విలాసం**
**స్మరతి మనో మమ కృతపరిహాసం."**

ఆమె లేచి భావం ప్రస్ఫుటమయ్యేటట్లు అభినయించింది.

నరసింహం అష్టపది పూర్తిగా చదివాడు. చదివాడనడంకన్న పాడినాడనుకోవడం సబబు.

అభినయం తరవాత ఆమె వారి ఎదుట విలాసంగా కూర్చుంది.

"నరసింహంగారూ! మీ గానం లలితలలితంగా ఉంది. ఎంతమందిచేతనో అష్టపదులు చదివించాను. మీరు చదివిన తీరు వేరు. మీవంటివారి స్నేహం మనసారా వాంఛిస్తున్నాను" అంది ఆమె.

నరసింహం ఆమెకు కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారం చేసి, వారిరువురి దగ్గిర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

## 27

ఆ మరునాడు నరసింహం రామారావు గారింటికి వెళ్లాడు. ఇల్లు బావురుమంటున్నది. రామారావుతల్లి ఒడిలో పిల్లవాడిని పెట్టుకొని కూర్చుంది. పరిస్థితులు అర్థమయ్యాయి నరసింహానికి.

ఆమెను పరామర్శించి మాట్లాడుతూ కూర్చున్నాడు.

"నరసింహం మావాడు సన్యాసుల్లో కలిసిపోతా నంటున్నాడు. నాకేం పాలు పోలేదు. పిల్లవాడి మాట చెప్పనే అక్కరలేదు. వయస్సు చెల్లినా నేను ఉండిపోయాను. పాపాత్మురాలిని" అంది ముసలావిడ.

రామారావు వీధిలోంచి వచ్చేసరికి రాత్రి పది గంటలయింది. అంతవరకు నరసింహం అక్కడే కూర్చున్నాడు. నరసింహాన్ని చూడగానే రామారావు కళ్లనుండి నీళ్లు జలజల కారాయి. జేబు రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ గోడకు చేరబడిపోయాడు రామారావు.

"నేను మిగిలిపోయాను నరసింహం."

"పిచ్చిమాటలాడకండి రామారావుగారూ. జీవితంలో కష్ట సుఖాలు తప్పవు. మీ పిల్లణ్ణి, తల్లిని చూచుకునే బాధ్యత మీ మీద ఉంది."

"ఏమి బాధ్యతో?"

నరసింహానికి ఏమి తోచలేదు. దుఃఖాన్ని వెంటనే తోసిపారవేయడం కష్టం. అవకాశం దొరికినప్పుడు రామారావుని ఊరిలో తిప్పుతూ సానునయంగా మాట్లాడుతూ, దుఃఖోపశమనం గురించి పాటుబడ్డాడు. ఉద్యోగంలో చేరితే దుఃఖం తగ్గవచ్చునని, అతనికి నచ్చజెప్పి ఉద్యోగంలో చేర్చాడు.

అతనితో కలిసి పనిచేస్తూ, మనస్సు మామూలు దారిలో పెట్టడానికి ప్రయత్నించాడు.

ఎండాకాలం గడిచిపోయింది. ఇంజనుమీద ఏది ముట్టుకున్నా కాలుతుండేది. లోపల ఇంజనువేడి, పైన ఎండవేడి. ముఖం మాడిపోయి, గాలికెగిరిన బొగ్గు ధూళి ముఖాన్ని కప్పేది. రాక్షసవేషాలు వేసుకున్న వారిలా రన్నింగురూములకు చేరే ఫైరుమనులు కనిపించేవారు.

వర్షాకాలం వచ్చింది. వర్షాలు అప్పుడూ అప్పుడూ పడేవి. భూమి చల్లబడింది. శ్రావణంలో జానకిని అత్తవారు నోములకోసం తీసుకొని వెళ్లారు.

దసరాలకు అల్లుణ్ణి తీసుకొని వచ్చింది సుబ్బమ్మ. జానకి పెద్దమనిషి అయింది. కూడబెట్టిన రెండువందలరూపాయలు దసరా ఖర్చులకు నరసింహం పంపించాడు.

పుష్యమాసం పండుగ వచ్చింది. పెద్దపండుగకు అల్లుడు, వియ్యపురాలు, ఆమె ఇద్దరు కూతుళ్లు సుబ్బమ్మగారింటికి వచ్చారు. ఆ ఇంట్లో సుబ్బమ్మే అన్నిటికి శ్రమ పడవలిసి వచ్చింది. గోపాలం సాయం అప్పుడప్పుడు లభించింది. గోపాలం కొడుకు తరుచు సుబ్బమ్మ గారి ఇంట్లోనే ఉండేవాడు. పండుగ రోజుల్లో వాడికి నిక్కరు, చొక్కా కుట్టించింది సుబ్బమ్మ. నరసింహం ప్రయత్నించాడు గాని సెలవు దొరకలేదు. పండుగులకు చాలమంది పనివాళ్లు డాక్టరు సర్టిఫికేటుల మీద ఉండిపోయారు. అవసరం వచ్చినప్పుడు పండుగకన్న పని ముఖ్యమని నరసింహం అనుకున్నాడు.

ఫిబ్రవరినెలలో రామారావు నెల్లాళ్లు సెలవు పెట్టాడు. ఎక్కడికేనా తిరిగి రావాలని ఉందని, ఎక్కడికిపోతే మనశ్శాంతి లభిస్తుందో తెలియదని నరసింహంతో అన్నాడు. ఏదైనా పల్లెటూరు పోయి ఏకాంతంగా ఉండి రావాలని ఉందని, పొలాలగట్ల మీద, ఏటి ఇసుకలలోను, తోటల నీడలలోను తిరిగివస్తే మనశ్శాంతి లభిస్తుందేమోనన్నాడు. నిడదవోలులో స్వంత ఇంట్లో పదిహేను రోజులు గడిపి, మిగిలిన పదిహేను రోజులు ఏదో పల్లెటూరు పోతానన్నాడు.

నరసింహం తన పల్లెటూరిని గురించి ఏకరువు పెట్టాడు. అంతమంచి ఊరులేదని, పట్టణానికి దూరంగా ఏళ్లు, పొలాలు, తోటలు, ఏకాంతత మొదలయినవన్నీ కోరినవి లభిస్తాయని చెప్పాడు. శివరాత్రికి మంచి యాత్ర జరుగుతుందని, పిల్లడిని కూడా తీసుకుని వెళ్లితే బాగుంటుందని చెప్పాడు. తన ఇంట్లో ఉండవచ్చునని, సుబ్బమ్మ తనకన్న హెచ్చుగా అతనిని చూసి ఆదరిస్తుందని చెప్పాడు.

రామారావు కొంచెం తటపటాయించాడు. నరసింహాన్ని కూడా సెలవు తీసుకొని తనతోబాటు రమ్మన్నాడు. నరసింహం ప్రయత్నిస్తానన్నాడు. తను వచ్చినా రాకపోయినా తప్పకుండా తన ఊరు వెళ్లమని చెప్పాడు.

నరసింహం ఆంధ్ర విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషను పరీక్షకి కట్టాడు. మార్చినెలలో పరీక్షలు. పరీక్షల ముందు కాలం వ్యర్థంగా గడపడానికి అతను ఇష్టపడలేదు. వీరభద్రరావు ఇంగ్లీషు, లెక్కలు చెబుతున్నాడు. సంస్కృతం, సివిక్సు, హిస్టరీ నరసింహం స్వంతంగా చదువుకునేవాడు. మాధవరావుగారింటికి కూడా వెళ్లడం మానివేశాడు.

జానకికి మాఘంలో కార్యం చేయవలిసి ఉందని, ఆ నాటికి తప్పకుండా రమ్మని సుబ్బమ్మ ఉత్తరం వ్రాసింది. అల్లుడు శ్రీకాకుళం తాలూకాఫీసులో గుమస్తాగా ఉద్యోగం చేస్తున్నాడని, కుటుంబం అంతా అతనితోనే ఉందని ఆమె వ్రాసింది.

మార్చి రెండవ వారంలో మెట్రిక్యులేషను పరీక్షలకు నరసింహం బెజవాడ వెళ్లాడు. బస రంగారావుగారింట. భోజనం హోటలులో. కమల స్వంత అన్నదమ్ముడికన్న హెచ్చుగా నరసింహాన్ని చూచుకుంది. బెజవాడలో ఉన్న వారం రోజులలో ఒక సాయంకాలం నరసింహం వేంకటేశ్వరుల ఇంటికి వెళ్లాడు. వేంకటేశ్వరులు, కుటుంబం నరసింహాన్ని చూచి చాలా సంతోషించారు. అతని పిల్లలకు మిఠాయి కొని ఇచ్చాడు. నరసింహాన్ని చూచి వేంకటేశ్వరులు భార్య మొదట పోల్చుకోలేక పోయింది.

కాలరులేని చొక్కా, ఎగగట్టిన పంచ, దగ్గిరగా కత్తిరించిన జుత్తుగల నరసింహం కాడితడు. చక్కటి క్రాపింగు, పంట్లాం, కోటు, జోడు ఎవరో పెద్ద ఉద్యోగస్థుడులా కనిపించే నరసింహాన్ని ఆమె పోల్చుకోలేకపోవడంలో ఆశ్చర్యమేముంది?

వేంకటేశ్వరులు ఎన్నో సంగతులు చెప్పాడు. అందులో ముఖ్యమయినది రమణయ్యగారి ఇతివృత్తం. ఆయన లంచాలు పుచ్చుకునే పద్ధతిలో ఊహించరాని అవధులకు పోయారని అన్నాడు. కార్మికులు నానా ఇబ్బంది పడుతున్నారని, సెలవు, పాసు, ప్రమోషను మొదలయిన వాట్లలో ఒకొక్కదానికి ఒక రేటు నిర్ణయించారని కూడా చెప్పాడు.

నరసింహం పరీక్షలైననాటి రాత్రే వెళ్లిపోతానన్నాడు. ఇంకా రెండు రోజుల సెలవు మద్రాసులో గడపడం కన్న ఒకరోజు తమతో గడపమని రంగారావు కోరాడు. మరునాడు ఆదివారం సావకాశంగా కాఫీలు త్రాగి, టిఫిన్ సేవించి, నరసింహాన్ని దగ్గిర కూర్చోబెట్టుకుని, రంగారావు, కమల అతను ఏ విధంగా పరీక్షాపత్రాలకు జవాబులు వ్రాసింది అడగడం మొదలుపెట్టారు.

ఇంగ్లీషు, లెక్కలు ఈ రెండిటిని గురించి రంగారావు ప్రశ్నించాడు. నరసింహం వ్రాసిన నోట్సు చూచాడు. ప్రశ్నలకు ఏ విధంగా జవాబులు వ్రాశాడో చెప్పమన్నాడు. లెక్కలు తిరిగిచేసి, జవాబులు సరిగా ఉన్నవో లేవో అడిగాడు.

కమల సివిక్సు, హిస్టరీలలో ప్రశ్నలకు జవాబులు అడిగింది. ఇద్దరికీ రానిది సంస్కృతం కాబట్టి అందులో ఎలా వ్రాశావని మాత్రం నరసింహాన్ని అడిగారు.

"సంస్కృతంలో చెప్పవలసినదేమీ లేదు. బహుశా అందులో మంచి మార్కులే రావచ్చు" అన్నాడు నరసింహం నిబ్బరంగా.

"ఇంగ్లీషులో నూటికి ఎనభై మార్కులకు తగ్గవు. లెక్కలు నూటికి తొంభై పైగా వస్తాయి" అన్నాడు రంగారావు.

"సివిక్సు, హిస్టరీలలో ఎన్ని వస్తాయో చెప్పలేను. గాని ఇంగ్లీషు, లెక్కలకు మాత్రం తీసిపోవు" అంది కమల.

రంగారావు రెండు చేతులతో నరసింహం చేతులను తీసుకొని "బావగారూ, నేను చాల గర్విస్తున్నాను. మీరు విశ్వవిద్యాలయం పాత రికార్డునుమించి, మొదటి వారుగా వస్తారు!" అని అన్నాడు.

రసింహం నవ్వి, "మీకు నామీదగల అభిమానం కొద్ది అంటున్నారు గాని, నేనంత తెలివితేటలు గలవాణ్ణి కాను. ఏదో పాసయితే చాలు. అంతకుపైగా ఏదేనా క్లాసువస్తే, అదంతా మా గురువుగారు వీరభద్రయ్యగారి ఆశీర్వచనమే అనుకోండి" అని అన్నాడు.

## 28

మాఘమాసంలో జానకి కార్యం అయింది. నరసింహం వెళ్లలేదు. సుబ్బమ్మ చాల విచారించింది. గోపాలం ఆమెకి చాలా సహాయం చేశాడు. జానకి అత్తవారింటికి శ్రీకాకుళం వెళ్లిపోయింది. సుబ్బమ్మ కూతురుని దిగబెట్టి వియ్యాలవారింట ఒక వారం రోజులు ఉండి గ్రామానికి తిరిగి వచ్చింది. దానికి లేని ఆ ఇంట్లో ఒక్కరితే ఉండలేకపోయింది మద్రాసు వెళ్ళదామనుకుంది గాని నరసింహం ఉండేది ఒకటే గది. అందులో ఉండడానికి సదుపాయంగా ఉండదు. పోనీ మాధవరావుగారింటికి వెళితే వారానికి ఒకటి రెండుసార్లు నరసింహాన్ని చూడవచ్చు. ఆమెకు ఇంకొకరి ఇంట్లో చాలాకాలం ఉండడం ఇష్టం లేకపోయింది.

నరసింహానికి ఉత్తరం వ్రాసింది. కొంచెం సదుపాయంగా ఉన్న ఇల్లు చూస్తే మద్రాసు వస్తానని వ్రాసింది. ఇంట్లో ఒక్కరితీ ఉండలేకపోయింది. క్రమేపి గోపాలం కుటుంబం తరుచు తన దగ్గరే ఉండేవారు. గోపాలం కొడుకు ఆమె దగ్గరే ఉండిపోయాడు. పొలంపని, తోటపని సరిగా జరుగుతున్నవో లేదో చూడమని కంబారుల మీద అధికారం గోపాలానికి ఇచ్చింది.

గోపాలం పూర్వపు గోపాలం కాదు. మనిషిలో మార్పు వచ్చింది దెబ్బ తగిలిన తర్వాత వారం రోజుల వరకు తాగడానికి అవకాశం దొరకలేదు. ఆ తరవాత అతను మరి ఆ ఊసుకుపోలేదు. జతగాళ్లు ప్రయత్నించారు గాని మనసు మార్చలేకపోయారు. మగసాయం లేని సుబ్బమ్మగారి పనులు చూస్తూ వీధి బడిలో పిల్లలకు చదువుచెబుతూ కాలం

గడపడం మొదలుపెట్టాడు. రోజుకిరోజులు అలాగే గడిచిపోయాయి. పెళ్లాం, తను రాట్నం మీద నూలు వడకడం మొదలుపెట్టారు. పెరుడు బాగుచేసి, పాదులుపెట్టి, అరటి మొక్కలు నాటి శ్రమపడ్డాడు. సుబ్బమ్మ కూడా తన కళ్లను తానే నమ్మలేకపోయింది ఒక పనికిరాని తాగుబోతు బాగుపడడం చూసి.

తాను కొడుకు దగ్గిరికి పోతే ఇల్లు, తోట, భూములు వీటిని ఎవరు చూస్తారని సుబ్బమ్మ బెంగపడేది. గోపాలంలో రోజురోజుకు కలిగిన మార్పు చూసి అతనికి అన్ని అప్పజెప్పి నిశ్చింతగా వెళ్లిపోవచ్చు ననుకుంది.

మే నెలాఖరున ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షాఫలితాలు వచ్చాయి. నరసింహం మొదటి తరగతిలో పాసయ్యాడు. విశ్వవిద్యాలయానికి మొదటి వాడిగా వచ్చాడని తరవాత తెలిసింది. ఫలితాలు తెలిసిన సాయంకాలం నరసింహం వీరభద్రయ్య దగ్గరికి వెళ్లి ఫలితం సంగతి ఆయనకి చెప్పి నమస్కరించాడు. వీరభద్రయ్య సంతోషం పట్టలేక నరసింహాన్ని కౌగిలించుకున్నాడు.

"నరసింహం నేను గర్విస్తున్నాను. ఈ విజయం నీది కాదు నాది" అన్నాడు వీరభద్రయ్య.

"మీరు వేసిన పునాది. మీరు నిర్మించినదీ సౌధం. మీరు నేనంటే ఆసక్తి చూపని నాడు నేను బీడుగా పడి ఉండేవాడిని. నాకు జన్మాంతరాలలో కూడా పూర్వజన్మల జ్ఞాపకాలు కలిగినట్లయితే మిమ్మల్ని తలుస్తాను. లోకంలో మీ వంటి వారు ఎంతమంది ఉన్నారు. నేను అదృష్టవంతుడిని. మీ దృష్టిలో పడజేసిన పరమేశ్వరునికి నమస్కరిస్తున్నాను" అన్నాడు నరసింహం.

"ఆ, నేను చెప్పినదేపాటి? నువ్వు చదవబట్టి, శ్రద్ధ చూపించబట్టి పాసయావు. ఎంతమందికి నేను చెప్పలేదు. ఎవరినైనా చెయ్యెత్తి చూపగలనా, నిన్ను తప్ప. రేపు నీ హాల్ టికెట్, పరీక్షాఫలితాలు పడిన పత్రిక పట్టుకుని మెకానికల్ ఇంజనీరుగారి దగ్గరకురా. నేను కూడా చెబుతాను. నీలో ఈ కోరిక నిలిపిన వారాయన. చాలా సంతోషిస్తారు."

"మీరు చెప్పినట్లు చేస్తాను. ఆయనకి సంగతి చెప్పడానికి సంకోచంగా ఉంది.

ఆయన కేంబ్రిడ్జి పరీక్షకు కట్టమన్నారు. నేను మెట్రిక్యులేషను కట్టాను. ఆయన మరో విధంగా భావించరా?"

"ఆ భయం ఏమీలేదు. ఈ పరీక్ష కూడా దానికి తీసిపోదు."

మరునాడు నరసింహం ముందు ఫోరమనును ధరలు కలిసి పరీక్ష పాసయిన సంగతి చెప్పి డివిజనల్ మెకానికల్ ఇంజనీరు గారిని చూడడానికి అనుమతి కోరాడు. నరసింహాన్ని అభినందించి అనుమతి ఇచ్చాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు నరసింహం మెకానికల్ ఇంజనీరు గారిని చూశాడు. ఆయన దగ్గర వీరభద్రయ్య ఏదో కేసు పట్టుకుని నిలబడ్డాడు. నరసింహాన్ని ఆయన గుర్తించి చేసిన నమస్కారాన్ని అందుకున్నారు.

"ఏం నరసింహం, ఉద్యోగం బాగా చేస్తున్నావా?" అని ఇంజనీరుగారు అడిగారు.

"బాగానే చేస్తున్నాను. మీరు నా పరీక్షనాడు కేంబ్రిడ్జి పరీక్షలకు చదవమన్నారు. ఆ పరీక్షలకు కాకపోయినా ఆంధ్ర విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషను పరీక్షకు మార్చి నెలలో కూర్చున్నాను. పరీక్షలో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడిని

అయ్యానని తమతో మనవి చేయడానికి సంతోషిస్తున్నాను. ఇవాళ విశ్వవిద్యాలయం నుండి ఒక టెలిగ్రాము వచ్చింది. నేను విశ్వవిద్యాలయానికి మొదటివాడిగా వచ్చానని తెలియజేశారు. మీరు ఆదేశించిన ప్రకారం నా కర్తవ్యం నెరవేర్చాను" అన్నాడు నరసింహం.

ఇంజనీరుగారు టెలిగ్రామ్ చూచారు. కూర్చున్నవారు లేచి నరసింహంతో కరచాలనం చేసి అన్నారు.

"నరసింహం పరీక్షలో ఉత్తీర్ణుడవైనందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నీకు ఇచ్చిన మాట కూడ నేను మరిచిపోలేదు. నిన్ను మొదటి తరగతి ఫైరుమనుగా రాజమహేంద్రవరానికి ప్రమోషను మీద పంపుతున్నాను. త్వరలోనే ఆర్డర్లు వస్తాయి. నీకు సర్వత్రా విజయం లభించుగాక."

నరసింహం నమస్కారం చేసి ఆఫీసు పైకి వచ్చాడు వీరభద్రయ్య కూడా అతని వెనకే వచ్చాడు.

"నరసింహం నువ్వు మొదటి తరగతిలో వచ్చినందుకు ఎంతగానో సంతోషించాను. యూనివర్సిటీకి మొదటివాడిగా వచ్చినందుకు ఏ విధంగా అభినందించాలో నాకు తెలియదు. నిన్ను ఈ శ్రమకరమైన ఉద్యోగంలో ఎందుకు కాలుపెట్టమన్నానో తెలియదు. ఈ ఉద్యోగంలో శ్రమ నిన్ను వెంటాడుతుంది. ఏనాడైనా గుమస్తా ఉద్యోగంలోకి రావాలని కోరుకోగలవు. ఆ పని మాత్రం చేయకు. నువ్వు మద్రాసులోనే ఉంటావని నేను అనుకున్నాను. రాజమహేంద్రవరం అయితే ఎప్పుడో కలవడానికి మాత్రం అవకాశం ఉంటుంది. మంచిది. పోయిరా" అన్నాడు వీరభద్రయ్య.

నరసింహంకి మరి నాలుగు రోజులలో ఆర్డర్లు అందాయి. ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాలలో దొరికిన రెండవ ప్రమోషను ఇది. నరసింహం నిజంగా సంతోషించాడు. ప్రమోషను దొరికినందుకు కాదు, పవిత్రమైన గోదావరి సమీపంలో నివసించే అవకాశం దొరికినందుకు, తల్లిని తెచ్చుకొని ఇంటివద్దనైనా శుభ్రమైన తిండి తినడానికి అవకాశం దొరికిందని.

ఆరురోజులు బదిలీమీద వెళ్లడానికి సెలవు దొరికింది. పాసు దొరికింది. రెండు రోజులు మద్రాసులో తెలిసిన వాళ్లందరినీ కలిసి తాను వెళ్లిపోతున్న సంగతి చెప్పాడు. ఆప్తులలో మాధవరావు, వీరభద్రయ్య, రామారావు నిజంగా విచారించారు. మిగిలిన వాళ్లలో భైరవశాస్త్రి ఒకడు. ఆయన కూడ విచారించాడు. రంగారావుకి విశ్వవిద్యాలయానికి మొదటివాడిగా వచ్చిన సంగతి తెలియజేశాడు.

నరసింహం ప్రియంవదాదేవిని కలిసి చెప్పదలిచాడు. ఆమె వెళ్లినప్పుడు ఇంటి దగ్గిర లేదు.

నరసింహం మద్రాసు వదిలి వెళ్లిపోయాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS